కంపు కొడుతోంది..!



జాతీయ రహదారి నుంచి బస్టాండ్‌కు వచ్చే సర్వీస్ రోడ్డుపై పారుతున్న మురుగు

- జడ్చర్ల మున్సిపాలిటీలో ఎక్కడి మురికి అక్కడే
- డ్రెయినేజీలు చిన్నవి కావడంతో సమస్యలు ఉత్పన్నం
- కొత్త కాలనీల్లో కాల్వలు నిర్మించక అవస్థలు
- హౌజింగ్‌బోర్డులో అండర్ డ్రెయినేజీతో అస్తవ్యస్తం
- హైవే సర్వీస్ రోడ్డుపై పారుతున్న మురుగు

జడ్చర్ల టౌన్: దినదినాభివృద్ధి చెందుతున్న జడ్చర్ల మున్సిపాలిటీలో ఎక్కడ మురికి అక్కడే పేరుకు పోతుంది. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో గతంలో నిర్మించిన డ్రెయినేజీలు డ్యామేజీ అవుతుండటం, పెరిగిన జనాభాకు అనుగుణంగా చాలకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కొత్త కాలనీల్లో రియల్టర్ల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. హౌజింగ్‌బోర్డు కాలనీలో ఇటీవల వేసిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వల్ల కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద మురుగు, వరదనీరు రోజుల తరబడి నిల్వడంతో దుర్వాసన వెదజల్లుతుంది. అదేవిధంగా బస్టాండ్‌కు వచ్చే జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై మురుగు నీరు కారణంగా రాకపోకలు నిలిపివేసే పరిస్థితులు నెలకొన్నాయి. కావేరమ్మపేట డబుల్‌బెడ్రూం వద్ద డ్రైనేజీ నిర్మించకపోవడంతో వరదలా పారుతూ ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

హౌజింగ్‌బోర్డు కాలనీలో దుర్వాసన–దోమల బెడద

8వ వార్డు హౌజింగ్‌బోర్డు కాలనీ ఏర్పాటు సమయంలో అండర్ డ్రెయినేజీ ఇళ్లపక్కనుంచి నిర్మించారు. అయితే నాలుగేళ్ల కిందట దానిని తొలగించి రోడ్డు మధ్యంలోంచి పైపులు వేసి నూతనంగా నిర్మించారు. అప్పటినుంచి సమస్య రెట్టింపయ్యింది. పైపులు సైజ్ చిన్నగా ఉండడం, మురుగు తాకిడి అధికంగా ఉండడంతో పైప్‌లు జాం అయి మ్యాన్‌హోల్స్ ద్వారా రోడ్లపై పారుతున్నాయి. ఆ నీరు ఇళ్లల్లోకి వస్తున్నాయి. బయటకు వచ్చిన నీటి తో దుర్వాసన భరించలేకుండా ఉందని కాలనీవాసులు చెబుతున్నారు.దోమలు పెరిగి వ్యాధులు వస్తున్నాయని వాపోతున్నారు.డ్రైనేజీ నిర్మాణ సమయంలో పైపులు శుభ్రం చేసేందుకు మిషన్ తెప్పిస్తామని ఇప్పుడు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

రాజీవ్‌నగర్ కాలనీలో..

3వ వార్డు పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీ లోతట్టు ప్రాంతం కావడంతో పైనుంచి వచ్చే వరద, మురుగు నీరు ప్రవాహానానికి ఉన్న కాల్వలు చాలడంలేదు. అదిగా హనుమాన్ ఆలయం వరకు మాత్రమే కాల్వ ఉండడం తర్వాత కాల్వ నిర్మాణం చేయకపోవడంతో వరదలు వచ్చిన ప్రతిసారి మురుగు నీరు రోడ్డుపై నిలిచి ఇళ్లల్లోకి చేరుతున్నాయి. రాకపోకలు నిలిచిపోతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

విద్యానగర్‌లో..

24వ వార్డు విద్యానగర్ కాలనీలోనూ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. కాలనీ 5వ రోడ్డు నీళ్లట్యాంక్ సమీపంలో మురుగు కాల్వ లేక రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో దోమల బెడద పెరుగుతుందని కాలనీవాసులు వాపోతున్నారు.

కావేరమ్మపేట డబుల్‌బెడ్రూంల వద్ద

కావేరమ్మపేట డబుల్‌బెడ్రూంల వద్ద మురుగు సమస్య తీవ్రంగా నెలకొంది. మొత్తం 120ఇండ్లు ఉండగా.. 89 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ డ్రెయినేజీ నిర్మించకపోవడంతో మురుగంతా రోడ్డుపై పారుతూ పక్కన ఉండేవారికి తలనొప్పిగా మారింది. దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

విజయ్‌నగర్‌కాలనీలో..

9వ వార్డు విజయ్‌నగర్ కాలనీ బంజారాహిల్స్‌లో డ్రెయినేజీ సమస్య వేధిస్తుంది. అపార్ట్‌మెంట్‌కు చెందిన నీరు కాల్వలు లేక పెద్ద గోతి తీసి వాటిలోకి వదులుతుండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా కాలనీ ఏర్పాటు కావడంతో కాల్వల నిర్మాణానికి నోచుకోలేదు. కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడంలేదని వాపోతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమలు వస్తున్నాయని వ్యాధులు ప్రబలుతున్నాయని ఆరోపిస్తున్నారు. వీటితో పాటు నూతనంగా వెలుస్తున్న కాలనీల్లో రియల్టర్లు ప్లాట్లు విక్రయించడమే మా పని అంటూ వదిలేస్తుండడంతో మున్సిపాలిటీపై భారం పడుతుంది. కనీస సౌకర్యాల కల్పన భారంగా మారింది. ఇటీవల టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.7.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ అవి కేవలం 8 వార్డుల్లోనే కేటాయించారు. ఇక మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి ఒక్కో వార్డులో రూ.5లక్షలతో పనులు చేపడుతున్నా అవి ఏమాత్రం చాలడంలేదు.



కావేరమ్మపేట డబుల్‌బెడ్రూంల వద్ద పారుతున్న మురుగు

దుర్వాసన భరించలేకున్నాం



హౌజింగ్‌బోర్డు కాలనీలో పైపులతో అండర్ డ్రైనేజీ వద్దని వారించాం. ఇంతకుముందు ఉన్నట్లుగానే ఉండాలని పోరాడాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, కాల్వలు శుభ్రం చే సేందుకు మిషన్లు తెస్తామని చెప్పారు. ఇప్పుడేమో పూర్తిగా విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. పైపులు చిన్నవి కావడంతో మ్యాన్‌హోల్స్ ద్వారా మురుగు నీరు రోడ్లపైకి చేరి ఇళ్లల్లోకి వస్తున్నా యి. దుర్వాసనకు ఇంట్లో ఉండలేని పరిస్థితి.

– వెంకటేశ్, హౌజింగ్‌బోర్డు కాలనీ

రాకపోకలు బంద్ అవుతున్నాయి



రాజీవ్‌నగర్‌కాలనీ హనుమాన్ ఆలయం దాటాక కాల్వలేక పై నుంచి వచ్చే నీళ్లు రోడ్డుపై నిలి చి రాకపోకలు బంద్ అవుతున్నాయి. వర్షం వచ్చిన ప్రతిసా రి మా పరిస్థితి ఇబ్బందిగా మారుతుంది. రోడ్డుపై మురుగు, వరదనీరు నిలిచి దుర్వాసన వస్తుంది. దోమలు బాగా పెరుగుతున్నాయి. అంటువ్యాధులు వస్తాయన్న భయం వెంటాడుతుంది. కాల్వ నిర్మిస్తే సమస్య తీరుతుంది.

– వర్ల రమేశ్, రాజీవ్‌నగర్‌కాలనీ

ఫిర్యాదు చేసినా పట్టించుకుంటలేరు



విజయ్‌నగర్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్ నుంచి వచ్చే మురుగు నీటికోసం పెద్ద గుంత తీసింద్రు. దాని ద్వారా దోమలు వచ్చి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. అలాగే కాల్వలు లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు నీరు పారుతోంది. అధికారులకు ఫిర్యాదులు చేస్తే వచ్చి చూసి వెళ్తున్నారు.. ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పెద్ద గుంతను మూయించి ఇంకుడుగుంత నిర్మిస్తే బాగుంటది.

– కొత్తనారాయణ, విజయ్‌నగర్‌కాలనీ

ఇబ్బందిగా ఉంది



డబుల్ బెడ్రూంలు కట్టింద్రు బానే ఉంది. కానీ మురికి కాల్వ కట్టనందుకు ఇబ్బందిగా మారింది. ఆ ఇండ్ల నుంచి వచ్చే మురికి నీళ్లు అన్ని రోడ్డుపై సక్కగ మా ఆదర్శనగర్‌కు వస్తున్నాయి. ఆ నీళ్ల వాసన భరించలేకపోతున్నం. దోమలు వస్తున్నాయి. ఎవరికి చెప్పినా పట్టించుకుంటలేరు. ఇప్పటికైనా ఆ డబుల్ బెడ్రూంల నీళ్లు పోనిక్కె కాల్వ కట్టి పుణ్యం కట్టుకోండయ్య.

– అంజమ్మ, ఆదర్శనగర్, కావేరమ్మపేట

చర్యలు తీసుకుంటున్నాం

వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి ఎప్పటికప్పుడు మురుగు నిల్వ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీ రోజురోజుకు పెరుగుతుండడంతో కొన్ని సమస్యలు వస్తున్నాయి. పాతకాలనీల్లో డ్రెయినేజీలు డ్యామేజీ అవుతుండటం, కొత్తవాటిలో నిర్మాణాలు చేపట్టకపోవడం సమస్యలు. వీటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

క్లుప్తంగా

ఊరంతా వనభోజనాలు



అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌లో ఆదివారం గ్రామస్తులు వనవాసం (గంప జాతర) కార్య క్రమం నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురవాలని.. అందరు బాగుండాలనే సంకల్పంతో ప్రతిఏటా ఆషాడమాసంలో జరిగే కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులందరూ ఉదయమే ఇళ్లకు తాళాలు వేసి పొలాల వద్దకు వెళ్లారు. ఆడపడుచులు, బంధువులను ఆహ్వానించి చిన్నాపెద్దా తేడా లేకుండా ఊరంతా ఖాళీ చేసి వనాలకు వెళ్లారు. అక్కడే వంటలు చేసుకుని చెట్ల కిందే భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎవరూ ఊర్లో కి వెళ్లకుండా ప్రధాన దారిలో కంచె వేశారు. చెట్ల కింద చిన్నారులు, పెద్దలు సేద తీరారు. సాయంత్రం తర్వాత గ్రామస్తులందరూ ఊర్లోకి వచ్చారు.

హనుమాన్ చాలీసా పారాయణం



జడ్చర్ల టౌన్: కావేరమ్మపేట చంద్రమౌళీశ్వర ఆలయంలో ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో 41రోజులుగా చేస్తున్న హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం ముగిసింది. ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జడ్చర్ల–కావేరమ్మపేట మధ్యలో ఉండే పోచమ్మ ఆలయంలో మంగళవారం సాయంత్రం 5గంటలకు ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని సభ్యులు పిలుపునిచ్చారు.

గంటలో 350 బస్తాల యూరియా అమ్మకం



నవాబుపేట: యూరియా కోసం రైతులు ఆదివారం సైతం సహకార సంఘం కార్యాలయం చెంత క్యూకట్టారు. కాగా సంఘంలో కేవలం ఒక లారికి పైగానే ఎరువులు మాత్రమే ఉండగా మొత్తం 350 బస్తాల యూరియాను రైతులకు అందించారు. కాగా కేవలం గంట వ్యవధిలోనే ఉన్న ఎరువులు మొత్తం రైతులు తీసుకుని వెళ్లారు. కాగా సోమవారం సైతం సహకార సంఘంతో పాటు, ఆగ్రో కేంద్రాల్లో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ తెలిపారు. కాగా యూరియా కొరత ఉందటూ వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదని రైతులందరికీ కావాల్సిన యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు వారికి అవసరం ఉన్న మేరకే యూరియా తీసుకోవాలని సూచించారు.

శాపంగా మారిన అండర్‌పాస్



మహబూబ్‌నగర్ రూరల్: అండర్‌పాస్ నిర్మాణం మండలంలోని చౌదర్‌పల్లి వాసులకు శాపంగా మారింది. అండర్‌పాస్ నిర్మాణంలో భాగంగా రైల్వే పూలకిందనుంచి రాకపోకలకు దారి ఏర్పాటు చేశారు. మట్టిదారి కావడంతో చినుకుపడితే చిత్తడిగా మారి వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. అలాగే పూలకింద ఎగువ ప్రాంతం నుంచి వచే వర్షపు నీరు వెళ్లేందుకు కాల్వ తీయకపోవడంతో మోకాటి లోతు నిలుస్తున్నాయి. మట్టిపై డస్టగాని, కంకర వేయాలని పలుమార్లు సంబంధిత కాంట్రాక్టర్‌కు చెప్పినా పట్టించుకోవడలేదు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామస్తుల ఇక్కట్లను తొలగించాలని కోరుతున్నారు.

వచ్చేనెల 3న సీఎం రేవంత్‌రెడ్డి రాక

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల శివారులో ఉన్న ఎస్‌జీడీ ఫార్మా కంపెనీ రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి వచ్చేనెల 3న సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఎస్‌జీడీ ఫార్మా జనరల్ మేనేజర్ దీపక్‌సూద్ శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కంపెనీ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు. ఇదిలా ఉండగా సీఎం రానున్న నేపథ్యంలో కంపెనీ కొత్త యూనిట్ వద్ద పనులను యాజమాన్యం వేగవంతం చేసింది. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

ఉత్సాహంగా ఎస్‌పీఎల్ టోర్నీ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించి ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీ ముగిసింది. ఈ టోర్నీలో ఎనిమిది స్వర్ణకార జట్లు పాల్గొనగా.. కృష్ణకాంత్ ఆచారి జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రమేశ్‌చారి, సంఘం పెద్దలు, స్వర్ణకార సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి చెంత భక్తుల సందడి



నవాబుపేట: మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ ఆలయం చెంత భక్త జనం సందడి చేశా రు. ఆదివారం పెద్ద ఎత్తున జనం మైసమ్మ అడవికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. దీంతో అడవి మొత్తం అమ్మ వారి నామస్మరణతో మారుమోగింది. ఆదివారం సెల వు పైగా అమ్మవారికి ఇష్టమైన రోజుకావడంతో మైసమ్మ ఆలయం మొత్తం కిటకిటలాడింది.కాగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో పూజారులు భక్తులకు దర్శనం ఇప్పించారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



నిజాలాపూర్ బీఆర్‌ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ బీసన్నతోపాటు మరో 30 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, గాజుబండ శేఖర్, నవీన్, వెంకట్, ఆంజనేయులు, చింతకాయల రాజు, మండడి బాబు, జాజాల మారుతితోపాటు మరి కొందరిని ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఎమ్మెల్యే జీఎంఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తాము కాంగ్రెస్‌లో చేరినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మూసాపేట, అడ్డాకుల మండలాల అధ్యక్షులు శెట్టిశేఖర్, శ్రీహరి, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌సాగర్, రాంచందర్, విజయకుమార్, టైలర్ రాములు, దేవేందర్ రెడ్డి, వేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లలో రాజకీయ చైతన్యం రావాలి



ఇప్పలపల్లిలో కమిటీని ప్రకటిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముదిరాజ్‌లో రాజకీయ చైతన్యం రావాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ మండంలోని ఇప్పలపల్లిలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లందరూ జాతి ఐక్యత కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. మనజాతి బిడ్డలకు విద్యావకాశాలు పెంపొందాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ముదిరాజ్‌లందరూ ఏకమై విద్య, వైద్య, ఆర్థిక, ఉపాధి అంశాల్లో అవకాశాలు రావాంటే బీసీ ఏలోకి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బంగారు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా పసుల ఆంజనేయులు, కేశవులు, ప్రధాన కార్యదర్శిగా బంగారు సత్యనారాయతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రచార కార్యదర్శి బోల యాదయ్య, మండలాధ్యక్షుడు తుపాకుల చంద్రుడు, డీలర్ బుచ్చన్న, మండల ప్రచార కార్యదరశి వెంకట్రాములు, గ్రామ నాయకులు వెంకటయ్య, బజార్ రవి, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవచింతనలో పాల్గొనాలి



మజీదు నిర్మాణ దాతలను శాలువాతో సన్మానిస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: ప్రతిఒక్కరూ దైవచింతనలో పాల్గొనాలని జామే నిజామియాకు చెందిన ముస్లిం పర్సనల్ లాబోర్డ్ సభ్యుడు ఖలీల్ అహ్మద్ సాహబ్ అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన మజీదును తొలగించి దాని స్థానంలో కొత్తగా మజీదును పునర్నిర్మాణం చేశారు. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన మహ్మద్ ఖాజాపాషా సాహబ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు రాషద్ అండ్ ఇర్షాద్ బ్రదర్స్ గొల్డెన్ ట్రేడర్స్ వారు రూ.35లక్షలను వెచ్చించి పునర్నిర్మించారు. ఆదివారం మజీదును ఖలీల్ అహ్మద్ సాహబ్ ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఖలీల్ అహ్మద్ సాహబ్ ప్రసంగించారు. మజీదు నిర్మాణంలో భాగస్వాములైతే భగవంతుడు ఏదో ఒక రూపంలో తప్పక సాయం చేస్తాడని చెప్పారు. అందరు పవిత్రతను పాటిస్తూ భక్తితో ఉండాలని సూచించారు. దాతల కుటుంబీకులను మజీద్ కమిటీ అధ్యక్షుడు మైనొద్దీన్, ఉపాధ్యక్షుడు మదీనా హైమద్, ప్రధాన కార్యదర్శి కలీం, కోశాధికారి అబ్దుల్ ఖాదర్ తదితరులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మతపెద్దలు రవూఫ్అలీ సాహబ్, మౌలానా తస్లీమ్ అన్సారీ, మౌలానా ఫక్రుద్దీన్ సాహబ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే పశువుల తిష్ట

- వాహనదారులకు తప్పని తిప్పలు
- పోషకులకు జరిమానా విధిస్తున్నా మార్పులేని వైనం



అంబేడ్కర్ చౌరస్తాలో తిష్ట వేసిన పశువులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం పరిధిలోని ఎన్‌హెచ్– 167తోపాటు ప్రధాన, అంతర్గత రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు తిష్ట వేస్తున్నాయి. వీటి సంచారంతో వాహనాల రాకపోకలు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శ్రీనివాసకాలనీ మొదలుకుని కొత్త బస్టాండ్ వరకు గేదెలు, ఆవులు, ఎద్దులు సంచరిస్తున్నాయి. వాహనదారులు మధ్యలోనే ఆగి నెమ్మదిగా వెళ్తున్నారు. అలాగే మర్లు, భాగ్యనగర్‌కాలనీ, వన్‌టౌన్, రాయచూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ వీటి సంచారం ఎక్కువగా ఉంది. వీటి పోషకులను మున్సిపల్ అధికారులు గుర్తించి పలుసార్లు నోటీసులు ఇవ్వడమేగాక జరిమానాలు విధిస్తూనే ఉన్నారు. కొన్నిరోజుల పాటు వాటిని బయటకు వదలకుండా ఉంచుతున్నారు. తర్వాత మళ్లీ యథావిధిగా వదిలేయడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి.

మొక్కలు నాటిన హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురంలో ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సభ్యులు 142మంది ఏ ప్లాంట్ విత్ ఏ హార్ట్ నినాదంతో 142 మొక్కలు నాటారు. గ్రామం చుట్టూ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ వీధులతో పాటు చెన్నకేశవస్వామి ఆలయం, ఎల్ల మ్మ ఆలయం, భవానీమాత ఆలయం, మసీ దు, చర్చీ వంటి ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద నాటినట్లు తె లిపారు. గ్రామంలోని మతసామరస్యానికి, ఐక్యత కు నిదర్శనంగా కార్యక్రమం చేపట్టామన్నారు. ప ర్యావరణ పరిరక్షణలో భాగంగానే సంస్థ ద్వారా కా ర్యక్రమం చేపట్టామన్నారు.మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించుకోవటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

అంబేడ్కర్ అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా గిరేశ్‌కుమార్



కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పానుగంటి గిరేశ్‌కుమార్‌ను ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా, బహుజనుల శ్రేయస్సుకు కృషి చేయడం జరుగుతుందని గిరీశ్‌కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నుకున్న అంబేడ్కర్ అడ్‌హక్ కమిటీ సంఘం నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, టీచర్ మొగులయ్య, శ్యాం సుందర్, అరుణ్, రంగస్వామి, నర్సింహులు, వడెన్న, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి ఏనుగొండ దళితుల నిరసన



మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఏనుగొండ రెవెన్యూ గ్రామ దళితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 7వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో భాగంగా సాగు చేసుకునే సమయంలో నోట్లో మట్టి కొట్టకండి అంటూ రోడ్డు ఊడ్చి దళితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏనుగొండ శివారులోని సర్వేనంబర్ 431, 431/1, 433 అసైన్డ్ భూముల సమస్యను పరిష్కారం చేయాలని దళితులు దీక్షలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం ఆరోపించారు.

ప్రోత్సాహకానికే విద్యార్థులకు పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులతో ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో చదువుతూ వివిధ స్థాయిల్లో కురువ సామాజిక వర్గం విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభ చూపడం సంతోషంచదగ్గ విషయమని పాలమూరు యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో మదాసి/మదారి కురువ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మరింతగా వారి సామర్థ్యాలను పెంచుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉన్నతస్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్వాడ రాములు ప్రతిభా పురస్కారాల అవార్డు గ్రహీతలను మెమెంటో, శాలువా, క్యాష్ ప్రైజ్ అందజేసి సన్మానించారు. ఇంటర్‌లో తేజస్వి (992) మార్కులు, హర్షవర్ధన్ (991), ఉమాశ్రీ (988), పదో తరగతిలో బింగి పావని (566), నవ్యశ్రీ (560) ప్రథమ, ద్వితీయ స్థానాలు ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులైన జయప్రకాశ్, కృష్ణమూర్తి, గోపాల్, రాములును శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కన్వీనర్ నాగరాజు, కో కన్వీనర్ శ్రీశైలం, సభ్యులు వేణుగోపాల్, శివన్న, ఆంజనేయులు, సురేందర్, బాలయ్య, మల్లప్ప, వెంకటేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలి

మిడ్జిల్: తెలంగాణలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని టీఎస్‌యూటీఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, మండల అధ్యక్షుడు వెంకట య్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి ప్రతి క్లాస్‌కు ఒక టీచరు ఉంటాడని చెప్పి, పిల్లల్ని బడిలో చేర్పించుకోవడం జరిగిందని, ఉపాధ్యాయుల సర్దుబాటుపై మిగిలిన ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితి ఉందని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, నాణ్యమైన విద్యాబోధన కొనసాగించడం కోసం, ప్రతి 20మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బో‘నమో’ మైసమ్మ

- భక్తిశ్రద్ధలతో ఆషాడం బోనాలు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యం



నెత్తిన బోనంతో చిన్నారి

మహబూబ్‌నగర్ రూరల్/మున్సిపాలిటీ/స్టేషన్ మహబూబ్‌నగర్/మిడ్జిల్: పట్టణంలోని 11వ వార్డు పాతపాలమూరులో మైసమ్మ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, మహిళల బొడ్డెమ్మల మధ్య అందంగా అలంకరించిన బోనాలను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. పంచముఖికాలనీలోని బుర్జుగడ్డ మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం అమ్మవారికి కాలనీవాసులు బోనాలు సమర్పించారు. భవసార్ క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అంబాభవానీ ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఆయా పార్టీల నాయకులు సురేందర్‌రెడ్డి, ఎన్పీ వెంకటేశ్, నాగురావు నామాజీ తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మిడ్జిల్ మండలంలోని వేములలో ఆదివారం కోటమైసమ్మకు ఉపవాస దీక్షతో మహిళలు బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఎద్దుల బండ్ల, వాహనాలను అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.



బోనాలతో భవసార్ క్షత్రియ సమాజం మహిళల ఊరేగింపు



పాతపాలమూరులో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు